## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ



ప్రజాపక్షం/అశ్వాపురం : సిపిఐ సీనియర్ మహిళా నాయకురాలు, నాయకులు గణేషుల అమ్మాజీ అంబోజమ్మ కుటుంబాన్ని కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అమ్మాజీ అంబోజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివా ళుల ర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ మంచి నాయకున్ని కోల్పోయిందన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి

గ్రంథాలయ సంస్థ కార్యకలాపాలపై అదనపు కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రతి మండలంలో రెండు పాఠశాలల్లో రీడింగ్ రూమ్‌లు ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥పి.శ్రీజ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో రెండు పాఠశాలను ఎంపిక చేసి రీడింగ్ రూముల ఏర్పాటు చేయాలని, గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. గ్రంథాలయ మరమ్మతులు, అభివృద్ధి చేయాలని, నిధుల లేమి కారణంగా నిలిచిన పనులను అందుబాటులో ఉన్న నిధులతో పూర్తి చేయలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖా ధికారి సోమశేఖరశర్మ,జిల్లాపంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి అర్జున్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ : గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఆదివారం జరగనున్న ఐదవ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలు గణేశ్వరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ ఆసుపత్రి మేనేజ్ మెంట్ మరు వెంకటేశ్వరరావు ఆధ్వ ర్యంలో విద్యార్థుకు పరీక్షా సామాగ్రి ప్యాడ్, పెన్ను, బాటిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఎల్. గోపాలరావు మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు గణేశ్వరం పాఠశాల నుంచి 82 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికై విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఐదవ తరగతిలో చేరితే ఇంటర్ వరకు విద్యను అభ్యసించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఫీక్‌పాషా,ఎన్.వెంకటేశ్వరరావు,ఎ.విజయలక్ష్మి ,విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌తో అత్త, కోడలు మృతి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నాలుగు రోజుల వ్యవధిలోనే అత్త, కోడలు మృతిచెందిన ఘటన ఖమ్మం రూరల్ మం డలం పొలిశెట్టిగూడెం గ్రామ పంచాయతీలోని మద్దివారిగూడెంలో చోటు చేసుకుంది. బుధవారం అత్త చిక్కుల వెంకటమ్మ (60) క్యాన్సర్‌తో బాధ పడుతూ మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతిచెందిన నాలుగు రోజులకు పెద్ద కుమారుని భార్య (కోడలు) చిక్కుళ్ల కృష్ణవేణి (40) శనివారం మృతి చెందింది. ఆమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరిద్దరు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నాలుగు రోజుల వ్యవధిలోనే మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడికంటి చిన్నవెంకటరెడ్డి, మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెంపటి రాము కృష్ణవేణి భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## యువకునిపై హిజ్రా దాడి



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల పెద్దతండాలో ఓ యువ కునిపై హిజ్రా కత్తితో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం అర్థరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దతండా పరిధిలో గల క్వాలిటీ చికెన్ దుకాణంలో బాధావత్ మోహనకృష్ణ వర్కర్‌గా పనిచే స్తున్నా డు. గతంలో సోగని వీరబాబు (హిజ్రా)తో మోహనకృష్ణకు సనిత్యం ఉంది. గత కొద్ది రోజులుగా తనను పట్టించుకోవడం లేదని వీరబాబు మోహన్ పని చేస్తున్న చికెన్ షాపు వద్దకు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వచ్చి ఘర్షణ పడ్డాడు. హిజ్రా వీరబాబు ఆవేశంతో మోహనకృష్ణపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో మోహనకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబం ధించి పోలీసులు కేసు నమోదు చేసి హిజ్రాను రిమాండ్‌కు తరలించారు. దాడికి సంబంధించి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ రాజు తెలిపారు.

## సక్రమంగా ఎన్నికల విధులు : కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాచలం : ఎన్నికల విధులను సక్రమంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశమందిరంలో 27న జరగనున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పిఓ, ఎపిఓలకు రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది పోలింగ్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందురోజే సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలని, సామాగ్రి అంతటిని పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ రోజు ప్రతీ రెండు గంటలకు ఓసారి పోలింగ్ శాతాన్ని తెలపాలని, పోలంగ్ ముగియగానే బాక్సులు సీల్ చేసి నల్గొండ కలెక్టర్ కార్యాలయానికి పంపాలని చెప్పారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు సమర్థవంతంగా సిబ్బంది నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు దారా ప్రసాద్, పూసపాటి సాయికృష్ణ, కిరణ్ కుమార్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

## ప్రముఖ వ్యాపారవేత్త చెన్న లక్ష్మీనరసింహరావు మృతి



ప్రజాపక్షం/బోనకల్ : మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చెన్న లక్ష్మీ నరసింహరావు(78) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఎఐజిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఆర్య వైశ్యసంఘం మండల అధ్యక్షులు చెడే వెంకటేశ్వరరావు, సంఘం నాయ కులు గుర్రం పూర్ణచంద్రరావు, చెన్న కమలకుమార్‌లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. అనంతరం శనివారం కీర్తి శేషులు చెన్నా నాగేశ్వరరావు సతీమణి కమలేశ్వరి(85) ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పి ంచారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరికి నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు దొండపాట నాగేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులున్నారు.

# చివరి వరకు పోరాడితేనే విజయం

టెన్నిస్ క్రీడా నైపుణ్యతను చాటుతుంది

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను ప్రారంభించిన కలెక్టర్




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఓటమి అంచు వరకు వెళ్లి కూడా పట్టుదలతో ప్రయత్నిస్తే చివరకు విజయం సాధించవచ్చనే స్ఫూర్తి మనకు టెన్నిస్ క్రీడ ఇస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో ఖమ్మంజిల్లా టెన్నిస్ అసోసియేషన్ (కెడిటిఎ) ఆధ్వ ర్యం లో చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ జాతీయ స్థాయి టెన్నిస్ (మెన్స్) క్రీడా పోటీలను శనివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. మైదానం చుట్టు తిరిగి కలెక్టర్ సౌకర్యాలను, టెన్నిస్ కోర్టులను పరిశీలించారు. టోర్నమెంట్ నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీలకు ఖమ్మం వేదికైందన్నారు. మంచి కోర్టు, ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసుకోవడం మన జిల్లాలో ఉన్న టెన్నిస్ అసోసియేషన్ చిత్తశుద్ధికి నిదర్శనమని కలెక్టర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో మరింతగా క్రీడా స్ఫూర్తిని చాటుకునేలా టెన్నిస్ క్రీడను అభివృద్ధి చేసుకుందామన్నారు. టెన్నిస్ క్రీడ ద్వారా మంచి ఫిజికల్ ఫిట్‌నెస్, మెంటల్ స్టేబిలిటి లభిస్తాయన్నారు. టెన్నిస్ క్రీడలో ఎటువంటి పరిస్థితుల నుంచైనా విజయం సాధించవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఐదు సెట్లలో రెండు సెట్లు కోల్పోయి మూడో సెట్‌లో చివరి పాయింట్ దగ్గర నుంచి పోరాడి విజయం సాధించిన మ్యాచ్‌లు అనేక ం ఉన్నాయన్నారు. ఫెదరర్, నాథల్, జకోవిచ్ లాంటి క్రీడాకారులు అనేక సార్లు ఓడిపోయే పరిస్థితుల నుంచి విజయం సాధించారని కలెక్టర్ తెలిపారు. మన జీవితంలో కూడా ఎటువంటి పరిస్థితులు వచ్చినా నిబద్ధతతో నిజాయితీగా ఉంటూ ఓట మి ఒప్పుకోకుండా చివరి వరకు పట్టువదలకు ండా పని చేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తామన్నారు. ఆస్ఫూర్తిని మనకు టెన్నిస్ క్రీడ అందిస్తుందన్నారు. ఆటలు ఆడుతున్నప్పుడు పోటీ ఉంటుందని గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్‌రెడ్డి, ఏసిపి కుమార స్వామి, ట్రాఫిక్ సిఐ సాంబశివరావు, టెన్నిస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, చీఫ్ రిఫరీ ప్రవీణ్ నాయక్, కాళ్ల పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, కాళ్ల సూర్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష

రాయనున్న 335 మంది గిరి బిడ్డలు

టాపర్స్‌గా నిలిస్తే ప్రత్యేక ప్రోత్సాహం

పిఒ రాహుల్ వినూత్న ప్రయోగం



ప్రజాపక్షం/భద్రాచలం గిరిజన విద్యా సంస్థల్లో విద్యావిధానాలు మెరు గుపరిచేందుకు రకరకాల ప్రయోగాలను చేస్తున్న ఐటిడిఎ పిఓ రాహుల్ మరో వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాలయాల్లో పదో తరగతి చదువుతున్న గిరిబిడ్డలను చదువుల్లో మరింత ప్రోత్సహించి వారిని ఉన్న రంగాలవైపు నడిపించేందుకు నేటి ఆదివారం ప్రతిభా ప్రోత్సాహక పరీక్షలు నిర్వహించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 55 ఆశ్రమపాఠశాలలు 12 గిరిజన గురుకులాలకు చెందిన మొత్తం 335 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవు తున్నారు. ఇందు కోసం ఏజిహెచ్ఎస్ భద్రాచలం, ఏహెచ్ఎస్ పాల్వంచ, ఏజిహెచ్ఎస్ అంకంపాలెం, ఏహెచ్ఎస్ బుజ్జిగూడెం, ఏజిహెచ్ఎస్ ఖమ్మం ఐదు పరీక్షా కేంద్రా ల్లో ప్రతిభా ప్రో త్సాహక పరీక్షను నిర్వహిస్తున్నారు. మొ త్తం 150 మార్కుల కు గానూ నిర్వహించే ఈ పరీక్షలో ప్రతీ సబ్జెక్టు కు 25మార్కుల చొప్పున కేటాయించారు. అబ్జెక్టివ్ తరహాలో పరీక్ష విధానం ఉండనుంది. ఓఎంఆర్ షీట్‌లలో ఆన్సర్లు బబ్లింగ్ చేయాల్సి ఉంటుంది. భద్రాచలం ఐటిడిఎ చరిత్రలో ఇది తొలి ఘట్టం కావడం గమనార్హం. గిరిబిడ్డల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న పిఓ రాహుల్‌ను గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

## రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ప్రజాపక్షం/భద్రాచలం : మార్చి 2వ తేది నుండి ప్రారంభమయ్యే రంజాన్ మా సంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ జితేష్ వి.పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం ఐడిఓసిలో వివిధ శాఖల అధికారులు, ముస్లీం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మంచినీటి సరఫరాలో భాగంగా బావులు,ట్యాంకులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలన్నారు. రంజాన్ ప్రార్ధన సమయానికి అనుగుణంగా రెండు పూటాల మంచినీరు అందించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రార్ధనా మందిరాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, రంజాన్ పర్వదినం రోజున సరిపడా పాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, భద్రాచలం ఆర్‌డిఓ దామోదర్ రావు, జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి, వైద్యాశాఖాధికారి భాస్కర్ నాయక్, పాల్వంచ మున్సిపల్ కమీషనర్ సుజాత, పోలీస్‌శాఖ అధికారులు, కార్మికశాఖ అధికారి, ఆర్ అండ్‌బి, విద్యుత్ అధికారులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



ఐటిడిఎ పిఒ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం: గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు అదించేందుకు చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శనివారం మణుగూరు సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విద్యార్థినీలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణాలు ఉండాలని, వర్షపునీరు నిలవకుండా చూడాలన్నారు. రూ.1 కోటి 80 లక్షల వ్యయంతో చేపడుతున్న తరగతి గదుల నిర్మాణాలు ఆరు మాసాల్లో పూర్తికావాలన్నారు. అదే విధంగా పోలీస స్టేషన్‌లో నిర్మాణం అవుతున్న కౌన్సిలింగ్ హాల్‌ను పరిశీలించి ఒక నెలలో పూర్తి చేయాలన్నారు. అనంతరం బిపిఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్‌బుక్స్‌కు సంబంధించిన పాఠ్యాశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. బోర్డు పై లెక్కలు చేయించారు. విద్యార్థులు లెక్కలు, ఇంగ్లీ,ష్‌లలో వెనుకబడి ఉండటాన్ని గమనించిన ఆయన ఉపాధ్యాయులు చొరవతీసుకుని బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ చంద్రశేఖర్, డిఇ మధుకర్, ఏఇలు ప్రసాద్, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాలు మెరుగ్గా ఉండాలి




ఐటిడిఎ డిడి మణెమ్మ

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన సంక్షేమ శాఖలో చదువుతున్న విద్యార్థుల పతో తరగతి ఫలితాలు మెరుగ్గా ఉండాలని, పూర్తిగా 10/10 ఫలితాలు వచ్చేలా విద్యార్థులను సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిడి మణెమ్మ అన్నారు. శనివారం స్థానిక బిఇడి కళాశాల్లో పదో తరగతి విద్యార్థుల వందశాతం ఫలితాల కోసం సబ్జెక్టు టీచర్లకు నిర్వహించిన రెండో రోజు సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పదిలో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ఆయా సబ్జెక్టు టీచర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతి ఫలితాలు 91 శాతం వచ్చాయని, ఈ సారి 100 శాతం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ రమణయ్య, బిఇడి కాలేజీ ప్రిన్సిపల్ డా.వీరునాయక్, ఏటిడిఓ అశోక్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితులు అరెస్ట్

మగ్గురు వ్యక్తులు అరెస్ట్

మరో ఇద్దరి కోసం గాలింపు



ప్రజాపక్షం/పాల్వంచ : రూ.26 లక్షల విలువ గల సిగరేట్ల దొంగతనం కేసులో పోలీసులు నిందితులను అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశారు. ఈ మేరకు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి దోషులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ గత నెల 3న తేదిన డిఎంఆర్ హోల్‌సేల్ దుకాణంలో రూ.26 లక్షల విలువ గల సిగరేట్లు చోరీకి గురయ్యాయి. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులను సవాల్‌గా తీసుకున్న సిఐ సతీష్ కేసును చేదించి నిందితులను ఆదుపులోనికి తీసకున్నారు. డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన అశోక్ గణపతి, సునీల్ మనీష్‌లు ఈ దొంగతనానికి పాల్పడ్డారు. వీరిలో అశోక్ గణపతి పాల్వంచలోని ఒక కిరాణా దుకాణంలో పనిచేశారు. ఆయనకు పాల్వంచ వ్యాపారాలపై అవగాహన ఉండటం వల్ల తన స్నేహితులకు సమాచారం అందించాడు. ఇదే అదునుగా చేసుకుని 3వ తేది వారితో కలిసి రూ.26 లక్షల విలువైన సిగరేట్లును హైదరాబాద్‌లోని బోయినపల్లిలో వ్యాపారం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన వ్యక్తికి అశోక్ గణపతి విక్రయించాడు. అశోక్ గణపతి, మనీష్‌తో పాటు సరుకు కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. దీనితో సంబంధం ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని చెప్పారు. కేసు చేదించేందుకు సిఐ సతీష్‌ను డిఎస్‌పి అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై రాఘవయ్య, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాగమణి మృతికి మాజీ మంత్రి పువ్వాడ సంతాపం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ ముదిగొండ మండల మాజీ ఎంపిపి సామినేని హరిప్రసాద్ సతీమణి సామినేని నాగమణి శనివారం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతిపట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం తెలిపి, సామినేని హరిప్రసాద్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. నాగమణి భౌతికాయాన్ని ఎంఎల్‌సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు లు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిఏ సిహెచ్ రవి కిరణ్, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, యూత్ అధ్యక్షులు దేవభక్తిని కిషోర్, మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, బెల్లం వేణు, లక్ష్మారెడ్డి, పెంట్యాల పుల్లయ్య, ముత్యాల వెంకటా ప్పారావు, బంకామల్లయ్య, పచ్చా సీతారామయ్య తదితరులు నివాళులర్పించారు.

# ప్రజలకు నాణ్యమైన సేవలు

కోయచలకలో ట్రైనీ కలెక్టర్ పర్యటన



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తెలిపారు. శనివారం రఘునాథపాలెం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలను, హెల్త్ సెంటర్‌ను, వెటర్నరీ ఆసుపత్రిని ట్రైనీ కలెక్టర్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాల గురించి, చిన్నారులు, గర్భిణీలు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులతో ట్రైనీ కలెక్టర్ ముచ్చటించారు. అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. హైస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని హెచ్ఎంకు సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోజు వారి ఎంత మంది వస్తున్నారు, మందులు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పశు వైద్యశాలలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా, ప్రభుత్వం అందించే సేవల గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలని ట్రైనీ కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు శిరీష, రమాదేవి, మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రాజ్యలక్ష్మి, నరేష్, లింగరాజు, వెటర్నరీ వైద్యులు రాధాకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం సోని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్




ప్రజాపక్షం/కొణిజర్ల : మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేం ద్ర, రాష్ట ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్య క్షుడు దొండపాటి రమేష్ అన్నారు. కొణిజర్ల గ్రామశాఖ రైతు సంఘం మహాసభ శనివారం మండల కేంద్రం కొణిజర్లలోని దొండపాటి భవన్‌లో దడి పిన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు అనేక కష్టనష్టాలకోర్చి పంటలు పండిస్తే గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మిర్చిపంటకు నల్లి తెగుళ్లవలన పెట్టుబడి భారం పెరిగిందని కాని మిర్చికి గిట్టుబాటు ధరలేదని క్వింటాకు కనీసం రూ.25 వేలు ధర లభించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చిరై తులు గిట్టుబాటు ధరకోసం మిర్చిబోర్డు ఏర్పాటు సాధనే లక్ష్య ంగా ఉద్యమి ంచాలని పిలుపునిచ్చారు. మార్చి ఒకటోతేదీన కొణిజర్లలో నిర్వహించే రైతు సంఘం మండల మూడో మహాసభకు పెద్ద ఎత్తున రైతులు, నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రైతుసంఘం కార్యదర్శి తండు సోమ య్య, రైతుసంఘం నాయకులు స్వర్ణ రమేష్, తుప్పతి రామారావు, కొమ్మినేని వెంకయ్య, తోటపల్లి సీతారాములు, అడపా వెంకటేశ్వర్లు, రాయల వెంకయ్య, సూరంపల్లి రమేష్, కృష్ణయ్య, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఆయకట్టులో ఎండిపోతున్న పంటలు

వర్షాకాలంలో అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అతివృష్టి కారణంగా వర్షాకాలంలో సాగు చేసిన మొక్కజొన్నతో పాటు పత్తి దెబ్బతిన్నది. యాసంగిలోనైనా కలిసి రాకపోతుందా అని మొక్కజొన్న సాగు చేసిన రైతులకు సాగు నీరు అందక కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. సాగర్ ఆయకట్టుకు సంబంధించి వారబంధి విధించడంతో చివరి భూములకు నీరందక మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీటిని అందించాలని వారబంధిని తక్షణం ఎత్తివేయాలని రైతులు కోరుతున్నారు.

కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు



ప్రజాపక్షం/ఖమ్మం : సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందడం లేదు. సాగర్ జలాలకు సంబంధించి సాగునీటి విషయంలో వారబంధి విధించడంతో నీరు కేవలం ఆయకట్టు పై భూములకు తప్ప చివరి భూములకు నీరు అందడం లేదు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చింతకాని, బోనకల్, మధిర మండలాల పరిధిలోని భూములకు నీరు అందడం లేదు. కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లోని ఆయకట్టు చివరి భూముల పరిస్థితి దయనీయంగా ఉంది. బిబిసి పరిధిలోని రాపల్లి మేజర్ వట్టిపోయింది.ఈ కాలువ క్రింద సాగు చేసిన మొక్కజొన్న పంట ఎండిపోతుంది. పంటను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేక రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తుందన్న దశలో సాగునీటి కొరత ఏర్పడడంతో పంటలు ఎండిపోతున్నాయని ప్రత్యామ్నాయ అవకాశాలు కూడా లేవని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న తోటలను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయం లేక ఎండిపోతున్న భూములను చూసి తీవ్ర మనస్తాపానికి గురవు తున్నారు. కల్లూరు, తల్లాడ మండలాల్లో సాగర్ ఆయకట్టు పరిధిలో పొట్ట దశలో ఉన్న వరి పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. రైతులు సుదూర ప్రాంతాల నుంచి ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తరలించి పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అనేక వ్యయ ప్రయసాలకోర్చి పంటలను కాపాడుకుంటున్నామని అధికార యంత్రాంగం సాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పంటలను కాపాడుకునే క్రమంలో వారబంధిని ఎత్తివేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టి ఉన్నామని ఇప్పుడు పంటలు ఎండిపోతే మరో రెండేళ్ల వరకు కోలుకునే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పంటలను కాపాడుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ములుగు అడిషనల్ కలెక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చిమలపాటి మహేందర్ జి తల్లి రాధా బాయి ఇటీవల మృతిచెందగా ఆమె మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర పంచాయితిరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) శనివారం మండల కేంద్రానికి చేరుకుని రాధాభాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## మాథమెటిక్స్‌లో శారదకు డాక్టరేట్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ జిల్లా కేంద్రానికి చెందిన పానగంటి శారదుకు ఉస్మానియా యూనివర్సిటీ మాథమెటిక్స్‌లో డాక్టర్ పట్టా ప్రకటించింది. ప్రొపెసర్ వి ధర్మయ్య పర్యవేక్షణలో 'క్రైటీరియా ఫర్ ఓసిలేషన్ ఆఫ్ డిలే డిఫరెన్సియల్ ఇక్వెషన్' అనే అంశంపై శారద పరిశోధన చేశారు. 2017–18 వి ద్యాసంవత్సరంలో పిహెచ్‌డి అడ్మిషన్ పొందిన శారద 1 ఫిబ్రవరి 2025న ఫైనల్ వైవా విజయవంతంగాఈ పూర్తి చేయడంతో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపక బృందం, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు అభినందనలు తెలిపారు. డాక్టర్ శారద 8వ తరగతి చదువుతున్న రోజుల్లోనే కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన సోమారపు ఉపేందర్‌తో వివాహం జరిగింది. అయినా చదువు పట్ల ఆకస్తి తగ్గని శారద 1999–2000 సంవత్సరంలో పదవ తరగతి, 2001–2004లో ఇంటర్మీడియట్, 2005–2008లో డిగ్రీ, 2009–2011లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి పిజి పూర్తి చేశారు. 2013–14లో బిఈడి పూర్తి చేసి 13 సంవత్సరాలు ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ రెసిడెన్షియల్, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. పిహెచ్‌డి సాధించాలనే పట్టుదలతో 2017–18లో అడ్మిషన్ పొంది మాథమెటిక్స్‌లో పరశోధన చేసి 2025 ఫిబ్రవరిలో పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. భర్త సోమారపు ఉపేందర్ ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని ఈ సందర్భంగా శారద తెలిపారు. పరిశోదనకు సహకరించిన మిత్రు లు ప్రొపెసర్ ధీకొండ తిరుపతి, డాక్టర్ మహేష్ కొంగర, ప్రొపెసర్ అరూరి మహేందర్, దాసరి ధర్మయ్య, బాకీ పరంజ్యోతి, కూతుర్లు సాహితీ, సృజన, చైతన్యలకు డాక్టర్ శారద కృతజ్ఞతలు తెలిపారు.

## మార్చ్ 5 నుంచి ఎమ్ఎస్‌డబ్ల్యు ప్రథమ సంవత్సరం పరీక్షలు

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని దూరవిద్య దూర విద్యా కేంద్రం నిర్వహిస్తున్న 2023–2024 ప్రథమ సంవత్సరం బ్యాచ్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలను మార్చి 5, 7,11,13,17,19 తేదీలలో నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి జి. పద్మజ, దూరవిద్య కేంద్రం సంచాలకులు బి సురేష్ లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను 2.00. గంటల నుండి సా5.00.గంటలవరకు. నిర్వహించినట్లు వారు తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

### బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి



**ప్రజాపక్షం/గూడూరు:**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కేంద్రంలోని అన్ని గ్రామంల్లో జరిగే స్థానిక సంస్థల గ్రామ పంచాయితీలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున నిలబడే సర్పంచుల గెలిపించుకోవాలని గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి అన్నారు.శుక్రవారం ఆయన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడూతూ మండలంలోని 42 గ్రామ పంచాయతీ లకు 42 గ్రామపంచాయతీలు కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని అన్నారు.వేరే పార్టీలు గెలవద్దని టిఆర్ఎస్ హయంలో గూడూరు మండలంలో కాంగ్రెస్ సర్పంచ్ లే మెజార్టీస్థానాలు గెలవడం జరిగిందని అన్నారు. ఈసందర్బంగా గూడూరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కార్యయంలో కత్తి స్వామి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన రాధాను సాదరంగా ఆహ్వానించి ఆమెకు అభినందనలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు. గూడూరు మాజీ సర్పంచ్ ఎంపిపి నూనవత్ రమేష్ నాయక్ వారితో పాటు నాయకులు కన్నెబోయిన వెంకన్న పెసరి శివ హెచ్ శివ మండల మల్లేష్ భూక్య పద్మ బాలు చాంద్ పాషా చంటి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడే తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష

### అన్ని ఏర్పాట్లు చేశామన్న ప్రిన్సిపాల్ కిరణ్మయి



**ప్రజాపక్షం/వాజేడు:**తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష వాజేడు మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వెంకటాపురం జూనియర్ కళాశాల నందు పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఐదవ తరగతి కామన్ ఎంట్రెన్స్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ కిరణ్మయి తెలిపారు. ఇక్కడి కళాశాలలో 175 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఆమె తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థులు తమవెంట హాల్ టికెట్ తో పాటు బ్లూ బాల్ పాయింట్ పెన్నులు, పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

## రన్నింగ్ ట్రైన్ దిగుతూ రైలు కింద పడి రైల్వే ఉద్యోగి మృతి



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రన్నింగ్ ట్రైన్ దిగుతూ ప్రమాదవశాత్తు ట్రైన్ కింద పడి రైల్వే ఉద్యోగి మృతిచెందిన సంఘటన శనివారం జనగామ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రఘునాథపల్లి మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన యెడ్ల దుర్గేశ్వర్(48) జనగామ పట్టణంలోని గణేష్‌వాడలో నివసిస్తున్నాడు. దుర్గేశ్వర్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నాడన్నారు. శనివారం డ్యూటీ ముగించుకుని జనగామ చేరుకున్న ఆయన జనగామ రైల్వేస్టేషన్‌లో ట్రైన్ రన్నింగ్‌లో ఉండగా ఆయన దిగుతుండగా ప్రమాదవశాత్తు ట్రైన్ కింద పడి ఆయన మృతిచెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని, మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

# త్వరితగతిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** జిల్లాలో పిఎం శ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి లతో కలిసి పిఎం శ్రీ పథకం కింద ఎంపికైన 16 ప్రభుత్వ పాఠశాలలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద మొదటి విడుతలో 10 ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 2.74 కోట్ల నిధులతో పాఠశాలల్లో ఎల్ఈడి లైట్లు ఏర్పాటు, పాఠశాలలో పచ్చదనం, వర్మి కంపోస్ట్, కిచెన్ గార్డెన్లు, వివిధ రంగులతో కూడిన డస్ట్ బిన్లు , స్వచ్ఛత పక్వాడ స్వచ్ఛతనం కార్యక్రమం, నిపుణతో చర్చలు, వైజ్ఞానిక క్షేత్ర స్థాయి సందర్శనలు తదితర అంశాలను ప్రణాళికబద్ధంగా వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. రెండవ విడతలో పిఎం శ్రీ పథకం కింద 6 ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన రూ. 20.25లక్షల నిధులతో ఎల్ఈడి లైట్లు ఏర్పాటు పాఠశాలల్లో స్వచ్ఛ పచ్చదనం పెంపొందించుట హెర్బల్ గార్డెన్ల ఏర్పాటు, డిప్ ఇరిగేషన్ సిస్టం, వర్మీ కంపోస్ట్ ఇంకుడు గుంటలు, వివిధ రంగులతో కూడిన డస్ట్ బిన్లు, స్వచ్ఛత పక్వాడ స్వచ్ఛదనం కార్యక్రమం, నిపుణతో చర్చలు, విద్యార్థులకు క్షేత్రస్థాయి వైజ్ఞానిక సందర్శన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వర్మి కంపోస్టులు, ఇంకుడు గుంటలు ఏర్పాటు, జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు, రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఎల్ఇడి బల్బుల ఏర్పాటుకు నిత్యం పర్యవేక్షిస్తూ సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో మార్చి మొదటి వారంలోగా ఆయా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఒ కౌసల్యాదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి , జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సెక్టోరల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. దివ్యాంగులకు ప్రతినెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి జిల్లాకలెక్టర్ దివ్యాంగులు, వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణిలో దివ్యాంగులు, వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించిన 13 దరఖాస్తులు వచ్చాయి. డిపిస్డిఓ కు సంబందించి 7, జిల్లా సంక్షేమ శాఖ 5, జిల్లా పరిషత్తు కు సంబంధించిన 01 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ కౌసల్యాదేవి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు, వయోవృద్ధుల తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు

### జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఈనెల 25వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే మహాశివరాత్రి మహాజాతరకు విస్తృత ఏ ర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని పాలకుర్తిలో నిర్వహించే సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి కల్యాణ మహోత్సవ సందర్భంగా నిర్వహించనున్న మహాజాతర ఏర్పాట్లను జెసి రోహిత్‌సింగ్ డిసిపి రాజమహేంద్రనాయక్, వర్ధన్నపేట ఎసిపి నర్సయ్య, ఆర్‌డిఒ వెంకన్నలతో కలిసి శనివారం వారు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జెసి రోహిత్‌సింగ్ మాట్లాడుతూ ఈ మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌బాబును ఆదేశించారు. కల్యాణమండపంలో స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తులు తిలకించేలా ఘనంగా ఏర్పాట్లు చేపడతామన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు అందించి విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పర్యవేక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ రాములు, ఆలయ ఇఒ మోహన్‌బాబు, సిఐ మహేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి, రంజాన్ పండుగ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

### బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మహాశివరాత్రి, రంజాన్ పండుగల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మహాశివరాత్రి, రంజాన్ పండుగల నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ.. మహా శివరాత్రి సందర్భంగా బల్దియా పరిధి వరంగల్ నరగ పరిధిలో 30 ఆలయాలు, హన్మకొండ పరిధిలో 45 ఆలయాల్లో ఎలక్ట్రికల్ విభాగ అధికారులు లైటింగ్ ఏర్పాట్లు, సానిటేషన్ అధికారులు ఆలయ ఆవరణలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు డస్ట్ బిన్ల ఏర్పాటు చేయాలని, భక్తుల సౌకర్యార్థం మంచినీటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో ఫాగింగ్ చేయించాలని, రంజాన్ పవిత్ర ఉపవాస దీక్షలు మార్చి 2 నుంచి ఏప్రిల్ 2 వరకు కొనసాగే అవకాశం ఉన్నందున వరంగల్‌లో 55 మసీదుల్లో, హన్మకొండలోని 55 మసీదుల్లో ఎలక్ట్రికల్ విభాగం వారు సీరియల్ బల్బులతో అందంగా అలంకరించాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు వక్ఫ్ బోర్డు నుంచి తగు ఏర్పాట్లు చేసేలా చూడాలని, మసీదుల్లో శానిటేషన్‌తో పాటు ఫాగింగ్ చేపట్టేలా చూడాలని షబ్ ఏ బరాత్ పండుగ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

వేసవి కాలం నేపథ్యంలో నీటి సరఫరా తీరుపై సమీక్షవేసవి కాలం నేపథ్యంలో బల్దియా వ్యాప్తంగా నీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న ఫిల్టర్ బెడ్‌ల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వడ్డేపల్లి కేయూసీ ఫిల్టర్ బెడ్‌ల యందు పంపుసెట్లు ఏర్పాటుచేయాలని నీటి సరఫరా తీరుపై వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు క్షేత్రస్థాయిలో రెగ్యులర్‌గా పర్యవేక్షణ జరపాలని తక్షణ అవసరాల కోసం రోజువారి లేబర్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి సరఫరా జరుగుతున్న బావుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. పనిచేయని బోర్లు, చేతిపంపులను వెంటనే మరమ్మతులు చేయించాలని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా 15 శాతం ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలన్నారు. వేసవి కాలం నేథ్యంలో నగర అవసరాలకు సరిపడే నీటి నిల్వలు ధర్మసాగర్‌లో అందుబాటులో ఉన్నాయని నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబరు 9701999645, 7207908583, వాట్సప్ 9701999676లో సంప్రదించాలని కమిషనర్ నగర వాసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈలు రంగారావు, రాజ్‌కుమార్, రవికిరణ్, సానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వెనక్కి మళ్లిన పులి

### పల్గుల అడవిలో ఎద్దుపై పులి దాడి



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అటవీ ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా కలకలం రేపిన పులి సంచారం తిరుగు ముఖం పట్టి వచ్చిన దారిలోనే మళ్లీ పులి సంచారం కొనసాగించి కాటారం మండలంలోని నస్తూర్ పల్లి అటవీ ప్రాంతాలకు దాటినట్లు అటవీ అధికారులు వెల్లడించారు. గ త నాలుగు రోజులుగా పల్గుల, కాళేశ్వరం అటవీ ప్రాం తాల్లో కొనసాగిన పులి సంచారం శుక్రవా రం బీరాసాగర్ అటవీ ప్రాంతాల నుండి మహాదేవపూర్‌కాళేశ్వరం ప్రధాన రహదారి దాటి నస్తూర్ పల్లి అడవుల్లోకి వెళ్ళినట్లు పులి పాదముద్రల ఆధారంగా అటవీ అధికారులు గుర్తించారు. కాగా గత వారం రోజుల క్రితం కాటారం మండలం నస్తూర్ పల్లి అటవీ ప్రాంతాల గుండా మహాదేవపూర్ మండలం బీరాసాగర్ అటవీ ప్రాంతంలోకి తొలుత ప్రవేశించిన పులి సంచారం అన్నారం. పల్గుల, కాళేశ్వరం గ్రావిటీ కెనాల్ సమీప అటవీ ప్రాంతంలో గురువారం కొనసాగిన పులి సంచారం బీరాసాగర్ అటవీ ప్రాంతాలకు చేరి ఇంతకు ముందు వచ్చిన దారిలోనే తిరుగు ప్రయాణమై నస్తూర్ పల్లి అటవీ ప్రాంతాల్లోకి పులి వెళ్ళినట్లు అటవీ ప్రత్యేక బృందాల పరిశీలనలో తేలింది. గత నాలుగు రోజులుగా పల్గుల, కాళేశ్వరం అటవీ ప్రాంతాల్లో పులి సంచారంతో భయాందోళనలు చెందిన అటవీ ప్రాంత ప్రజలు పు లి వెళ్ళిపోయిందన్న సమాచారంతో హమ్మయ్యఅంటూఊపిరిపీల్చుకున్నారు.

**పల్గుల అడవిలో ఎద్దుపై పులి దాడి ఘటన:**పల్గుల అటవీ ప్రాంతంలో ఆ గ్రామానికి గ్రామానికి చెందిన నిట్టూరి శంకరయ్య అనే రైతుకు చెందిన ఎద్దుపై పులి దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పల్గుల శివారు అటవీ ప్రాంతంలో గత రెండు రోజుల క్రితం పులి సంచారం కొనసాగిన క్రమంలో అటవీ ప్రాంతాల వైపు ఎవరూ వెళ్ళలేక పోయారు. గత మూడు రోజుల క్రితం పల్గుల శివారు ప్రాంతాల్లో మేతకు వెళ్లిన ఎద్దు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన రైతు శంకరయ్య స్థానికులతో కలిసి శనివారం అటవీ ప్రాంతంలో గాలించగా ఒక ప్రదేశంలో పులి దాడికి పాల్పడిన ఎద్దు కళేబరం కనిపించింది. పులి దాడి ఘటనలో ఎద్దును గుర్తించిన రైతు తన ఎద్దును కోల్పోవడంతో లబోదిబోమన్నాడు.

## విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

### వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** విద్యార్థులు సమస్యలను సాధారణంగా పరిష్కరించుకోవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ హై స్కూల్ మామునూరు క్యాంపు నందు స్ఫూర్తి కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా డిఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు భారతదేశానికి భావి పౌరులన్నారు. శారీరక, మానసిక స్థితి, శాస్త్రీయ దృక్పథం అలవర్చుకున్నట్లయితే మంచి పౌరులుగా తయారవుతారన్నారు. విద్యార్థులు స్వీయ అవగాహన, నైపుణ్యాలు, తోటి వారిపై సానుభూతి, సమస్యల పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకునే విధంగా ప్రవర్తించాలన్నారు. భావ వ్యక్తీకరణ సరళంగా, సృజనాత్మకమైన ఆలోచనలు ఉండాలన్నారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను సాధారణంగా పరిష్కరించుకోవాలి, కానీ మానసిక ఒత్తిడికి గురికాకుండా, వారు ఎలాంటి ఉద్వేగం చెందకుండా, సూసైడ్ అటెంప్ట్ చేయకుండా, ప్రతి సమస్యను తెలుసుకొని పరిష్కారం మార్గాన్ని వేసుకోవాలని కోరారు. విద్యార్థులు వారి పరీక్షల పైన, వ్యక్తిగత సమస్యల పైన, సంక్షిప్తమైన ఆలోచనతో, సమయస్ఫూర్తితో, విశ్లేషించకుండా సంఘర్షణకు లోనవుతున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, తోటి స్నేహితుల సలహాలు తీసుకొని సంఘములో గౌరవంగా జీవించడానికి ప్రయత్నం చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ నిరంతరం టెలిమానస్ అనే ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మానసికంగా కౌన్సిలింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నదన్నారు. ఎవరైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వారు 1 4416 నెంబర్‌ను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, సైకియాట్రిస్ట్ డాక్టర్ బి భరత్ కుమార్, డాక్టర్ అఖిల, డాక్టర్ అన్వేషి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కళ్యాణి, రవీందర్, సంపత్, సత్యనారాయణరెడ్డి, సుజాత, అనిత, లత, రవికుమార్ ,పెద్దిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రచండ భానుడి భగభగలు

### హనుమకొండలో ఉష్ణోగ్రతల తీవ్రత



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ఫిబ్రవరిలోనే ఎండలు మండుతున్నాయి.మార్చి, ఏప్రిల్ నెలలు రాక ముందే భానుడి భగభగలు మొదలయ్యాయి. రాత్రి సమయాల్లో వాతా వరణం చల్లగానే ఉంటున్నా మధ్యాహ్నం మాత్రం సూరీడు సుర్రుమంటున్నాడు. ఫిబ్రవరి నెలలోనే ఏప్రిల్ నెలలో ఉండే ఎండలు ఉన్నాయంటూ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక ముమ్ముందు పరిస్థితేంటా అని ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఫిబ్రవరి నెలలో... అదీ శివరాత్రికి ముందు చలి ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ సారి ఇందుకు భిన్నంగా ఎండలు దంచికొడుతున్నాయి. రెండు మూడు రోజులుగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. పగటి ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. దీనితో పగటి పూట రోడ్లపై జనసంచార తగ్గుతున్నది. ముఖ్యంగా హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఎండకు భయపడి ప్రజలు అప్పుడే గొడుగులను ఆశ్రయించడం, టోపీలను ధరించడం కనిపిస్తోంది. అలాగే శీతలపానీయాలు, కొబ్బరిబొండాలు, ఐస్క్రీమ్, సోడా బండ్లు తదితర వాటి వద్ద రద్దీ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం 12 గంటలకు ఉమ్మడి జిల్లాలో అత్యదిక పగటి ఉష్ణోగ్రత సరాసరి 36 డిగ్రీలుగా నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్ పూర్లో అత్యధికంగా 37.01 డిగ్రీలు కాగా, ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో 36.8 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా దోర్నకల్లో 36.7 డిగ్రీలు, వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో 36.6 డిగ్రీలు, హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తిలో 35.8 డిగ్రీలు, జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. విక్రయాలకు సిద్ధమవుతున్న రంజన్లు ఎండాకాలం సమీపిస్తుండడంతో చల్లని నీటి కోసం అమ్మకానికి రంజన్లు సిద్ధమవుతున్నాయి. నగరంలో ఆయా చోట్ల రోడ్ల పక్కన విక్రయానికి రంజన్లను అందుబాటులో ఉంచుతున్నారు. సాధారణంగా ఎండలు ముదరక ముందే కొనుగోలు చేస్తే ఫ్రిజ్లు, మట్టితో చేసిన రంజన్లు, కుండలు, కూలర్లు తక్కువ ధరకు దొరుకుతాయి. అందుకే ప్రజలు ఒకింత ముందుగానే వీటిని కొనుగోలు చేస్తారు.

## సాగునీటి కొరత లేకుండా చూడాలి

### ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** నియోజకవర్గంలో రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సాగునీటి సరఫరా చేసే విధానాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించిన రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చూడాలన్నారు. రైతుల కోసం మనం అండగా నిలవాలని కోరారు. నీరు అందరికీ సమానంగా, క్రమంగా, సమయానుకూలంగా చేరాల్సిన అవసరం బాధ్యత అన్నారు. రైతులకు ఎదురయ్యే అనేక కష్టాలను తగ్గించడానికి వారి పంటలను సంరక్షించడానికి, వారి జీవనప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదం చేస్తాయన్నారు.

## పంట పొలాలకు నీరందించాలి



**ప్రజాపక్షం/జనగామ రూరల్:** బొమ్మకూర్ రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా పంట పొలాలకు నీరందించాలని కోరుతూ మండలంలోని గానుగుపహాడ్, పెద్దతండా ఎం, మరిగడి గ్రామాలకు చెందిన రైతులు నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మంగీలాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పెద్దతండ ఎం మాజీ సర్పంచ్ లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు లేక పంటలు ఎండిపోతున్నాయని, కావున బొమ్మకూర్ రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేస్తే మరిగడి గ్రామంలోని రెండు చెరువులు నిండుతాయని దీంతో భూగర్భజలాలు పెరిగి బోరు బావుల ద్వారా పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటామని వారు విజ్ఞప్తి చేశారు. కావున నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు చామకూర చిరంజీవి, గణేష్, నాగరాజు, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యమా..?

### అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం తగదని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఈ నెల 28లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం స్టేషన్‌ఘనపూర్‌లోని నమిలిగొండ గ్రామంలో క్షేత్ర స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ జనగామ జిల్లాలో మంజూరైన ప్రతి మరుగుదొడ్డిని లబ్ధిదారులు ఎట్టి పరిస్థితిలోనూ ఈ నెల 28 లోపు పూర్తి చేయాలన్నారు. నిబంధనలకు లోబడి రెండు గుంతలు, వై జంక్షన్ చాంబర్, డోరుతో సహాయ పూర్తి స్థాయిలో నిర్మించుకొని వాడుతున్నట్లుగా లబ్ధిదారుల ఫోటోతో పాటు బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు జిరాక్స్ ప్రతులను గ్రామ కార్యదర్శికి అందజేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే 12వేల రూపాయల ప్రోత్సాహాన్ని పొందాలన్నారు. సకాలంలో పూర్తి చేయకపోతే ప్రభుత్వం కేటాయించిన నిధులు వృథా అయ్యే అవకాశం ఉంటుందన్నారు. మరుగుదొడ్డి ని ర్మాణం చేసుకున్న లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. ఎంపిడిఓ, గ్రామ ప్రత్యేక అధికారి, గ్రామ కార్యదర్శినిఇ పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్, అదనపు డార్‌డో చంద్రశేఖర్, ఎంపిడిఒ విజయశ్రీ, ఏపో నర్సింహరావు, ఎపిఒ ప్రేమయ్య, పంచాయతీ కార్యదర్శులు యేసు మణి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ బాక్సులన్నీ కరీంనగర్‌కే చేర్చాలి

### 15 జిల్లాల అధికారులకు దిశానిర్దేశం
### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న 15 జిల్లాల్లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15జిల్లాల పరిధిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సుల రిసెప్షన్ కేంద్రం కరీంనగర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉంటుందన్నారు. అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌కు పంపించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ ప్రక్రియ జరగాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా పోలైన ఓట్ల బ్యాలెట్ బాక్సులను జిల్లా ఖజానా కార్యాలయంలో ఉంచాలని, కౌంటింగ్ రోజు ఉదయంలోగా ఆ బాక్సులను కరీంనగర్‌లోని కౌంటింగ్ కేంద్రానికి తరలించాలని తెలిపారు. పోలింగ్‌కు అవసరమైన మెటీరియల్ కరీంనగర్ నుంచి పంపిస్తున్నామని, వాటిని వివిధ జిల్లాల్లోని ఎన్నికల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ మొదలు ఫలితాలు వెల్లడి వరకు ఏఆర్‌వోలు అందుబాటులో ఉంటూ ఎన్నికలను పర్యవేక్షించాలని తెలిపారు. అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్

### ఎన్నికల నియమావళి పాటించాలి

ఎలక్షన్ కమిషన్ నియమావళికి అనుగుణంగా ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పరిషత్ ఆడిటోరియంలో శనివారం ప్రిసైడింగ్ అధికారులకు రెండో దఫా శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి పోలింగ్ స్టేషన్ సిసి కెమెరా పర్యవేక్షణలో ఉంటుందన్నారు. కెమెరా పనితీరుని పివోలు పరిశీలించాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అందించిన కరదీపికలోని మార్గదర్శకాలు పాటించాలన్నారు.అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లాపరిషత్‌సిఈవోశ్రీనివాస్,డిఆర్డీవోశ్రీధర్‌ఉన్నారు.

### రంజాన్‌కు అన్ని సౌకర్యాలు కల్పించాలి

వచ్చే నెల 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృష్ట్యా జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ముస్లింలు సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మసీదులో టెంట్ల ఏర్పాటు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధి లైట్లు మరమ్మత్తులు ఉన్న చోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ మాట్లాడుతూ అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్యం నిర్వహణకు జవాన్లను నియమిస్తామని తెలిపారు. రంజాన్ మాసంలో తాత్కాలిక స్టాళ్లు, దుకాణాలు ఏర్పాటు చేస్తే మున్సిపల్ అనుమతి తీసుకోవాలని కోరారు.అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



ప్రజాపక్షం/గొల్లపల్లి : ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దర్జాగా అక్రమంగా నిర్మాణాలు చేసిన ఇండ్లను రెవెన్యూ, అధికారులు కూల్చివేశారు. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంలో గల రామాలయం వెనుక సర్వే నెంబర్ 735, 544 లో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాగా శుక్రవారం కలెక్టర్ సత్య ప్రసాద్ వాటిని పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ వరందన్,పోలీస్ వారి ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి జేసీబీల సహాయంతో అక్రమ ఇండ్ల కట్టడాల కూల్చివేత చేపట్టారు. అధికారులు వారికి నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లా కేంద్రానికి శనివారం వచ్చిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ ను జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.జగిత్యాల పోలీస్ గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క ఇచ్చిన కలెక్టర్ హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ పాల్గొన్నారు.

## పటిష్ట ప్రణాళికతో ఎన్నికల నిర్వహణ



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతాపరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో డిఎస్పి లు, సి.ఐ పోలింగ్ రోజు,పోలింగ్ ముగిసిన తరువాత భద్రతాపరంగా చేయవలసిన ఏర్పాట్ల గురించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ కి సంబంధించి 71 పోలింగ్ కేంద్రలో 36,423 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకుంటారని, పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదనపు ఎస్పీ భీమ్ రావు, డిఎస్పిలు రఘుచందర్,రాములు, సిఐలు రాంనరసింహారెడ్డి, వేణు గోపాల్, కృష్ణారెడ్డి, రవి, నిరంజన్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు ఉన్నారు.

## బండి సంజయ్‌పై ఉల్లంఘన కేసు పెట్టాలి




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల వేళ వారి కార్యకర్తల ఎన్నికల సభలో బండి సంజయ్ కాంగ్రెస్ అభ్యర్థి ఒక్క ఓటుకు రూ.7 వేలు పంచుతున్నాడని పట్టభద్రులను అవమానపరిచే విధంగా మాట్లాడడం పట్ల సిపిఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి స్థాయిలో ఉండి ప్రజలను పట్టభద్రులను తప్పుదారి పట్టిస్తున్న బండి సంజయ్‌పై ఎన్నికల అధికారులు వెంటనే ఉల్లంఘన కేసు నమోదు చేయాలనిడిమాండ్ చేశారు. బండి సంజయ్ తన మాటలను వెనక్కు తీసుకుని పట్టభద్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## 'గాయత్రి' విద్యానికేతన్‌లో 'గ్రాడ్యుయేషన్‌డే'



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ : పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో శనివారం రోజున యుకెజి విద్యారరోజునగ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని సిరి ఫంక్షన్ హాల్ లో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయత్రి విద్యాసంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ రజనీదేవి దంపతులుకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో ఈ ప్రీ ప్రైమరీ విద్య అనేది అత్యంత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పలువురు యుకెజి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. యుకెజి విద్యార్థులకు ఒక తీయని జ్ఞాపకంగా మిగిలేలా గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించిన గాయత్రి విద్యా సంస్థల యాజమాన్యాన్ని పోషకులు అభినందించారు. ప్రిన్సిపాల్ విజయ్, పిఇటి స్రవంతి, ఉపాధ్యాయినీలు సౌమిని, రాజమణి, ఆఫీన్, రమ్య, పోషకులున్నారు.

## 'శ్రీ చైతన్య'లో వీడ్కోలు సమావేశం




ప్రజాపక్షం/చొప్పదండిః చొప్పదండి పట్టణ కేంద్రంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం వరలక్ష్మ ఫంక్షన్‌హాలులో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కవి, సామాజికవేత్త సామల కిరణ్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల కరెస్పాండెంట్ అమిరి రత్నాకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ గుండేటి వెంకటరమణ, డైరెక్టర్లు పంతగాని అనిల్ కుమార్, వెంగళ హరిప్రసాద్, అధ్యాపక బృందం స్వప్న, జగన్, కృపాకర్, రాజేశం, మౌనిక, రేఖ, అనూష, సతీష్ తదితరులున్నారు.

## ప్రసన్న హరికృష్ణకు సంఘాల మద్దతు

ప్రజాపక్షం/కరీంనగర్‌: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ బిఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసి అన్ని విద్యార్థి సంఘాల నుంచి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఓయూ జేఏసీ నేత కోడూరి రఘు మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ప్రధానజాతీయ పార్టీలు అగ్రవర్ణాల పెత్తందారులకు మాత్రమే టికెట్ ఇచ్చి ప్రోత్సహించారని దుయ్యబట్టారు. డాక్టర్ ప్రసన్న హరికృష్ణ బహుజన బిడ్డ అని, పూర్వ ఉస్మానియా విద్యార్థిగా విద్యను అభ్యసించారని తెలిపారు. ఎన్నో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో బహుజన గొంతుగా వినిపించేందుకు ఓటు వేయాలని కోరారు.

# ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేలా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రాడ్యుయేట్ , టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల పై అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరంమాట్లాడుతూ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, అక్కడ సీసీ కెమెరాలు లేదా నిరంతరాయంగా వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా గట్టి నిఘా పెట్టాలని,డబ్బు, మద్యం, ఇతర ఆభరణాలు పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ వీటిని నిరోధించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పెద్దపెల్లి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 27న అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాలను ప్రకటించాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను జాగ్రత్తగా రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూములను పరిశీలించారు.రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, ఏసిపి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి తహసిల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ ట్యాప్‌లను వినియోగించుకోవాలి

మిషన్ భగీరథ ద్వారా సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన త్రాగునీటి వాటర్ ట్యాప్‌లను కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు సిబ్బంది వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.శనివారం కలెక్టరేట్‌లో త్రాగునీటి వాటర్ ట్యాప్ లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఒక యూవి ప్యూరిఫైర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, మిషన్ భగీరథ బల్క్ నీటి సరఫరాకు అనుసంధానం చేశామని, కలెక్టరేట్ లోని ప్రతి ఫ్లోర్ లో రెండు వాటర్ ట్యాప్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని అన్ని శాఖలు అధికారులు, సిబ్బంది త్రాగునీటి ట్యాప్ లను వినియోగించుకోవాలని, ప్రైవేట్‌వాటర్ ప్లాంట్ల నుంచి త్రాగునీరు కొనుక్కోవాల్సిన అవసరం లేదన్నారు. మిషన్‌భగీరథ ఇంట్రాఈఈ గంగాధర శ్రీనివాస్, ఏ.ఓ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## యాష్, లోడింగ్ ఖర్చులు మాత్రమే చెల్లిస్తున్నాం



ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్ : పెద్దపల్లి జిల్లాలో ఇటుక బటీలకు ఎన్టీపీసీ యాజమాన్యం యాష్ ఉచితంగానే అందిస్తోందని పెద్దపల్లి ప్రాంత ఇటుక బట్టీల యాజమాన్య సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంఎస్ఎం ద్వారా 114 యూనిట్ల యాష్ ఉచితంగా ఇటుకబట్టీలకు ఇచ్చేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం అంగీకరించడంతో యాష్ వాడుతున్నామన్నారు. బట్టీలకు తరలించే యాష్ వాహనాల్లో లోడింగ్ కోసం ఖర్చులు మాత్రమే తాము చెల్లిస్తున్నామని చెప్పారు. బూడిద చెరువు వద్దకు వాహనాలు వెళ్ళడానికి రోడ్లు, వాటర్ క్యూరింగ్, లోడింగ్ తదితర ఖర్చుల కోసం మాత్రమే తాము డబ్బులు చెల్లిస్తున్నామని, ఎలాంటి అవినీతి అక్రమాలు జరగడం లేదని చెప్పారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ బటీలకు ఉచితంగా యాష్ ఇవ్వాలని అనేక సార్లు ప్రభుత్వం ద్వారా ఎన్టీపీసీ యాజమాన్యంపై తెచ్చిన ఒత్తిడి ఫలితంగా మాకు మేలు జరిగిందని అన్నారు. ఉచితంగా యాష్ తీసుకెళ్లేందుకు ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ఒప్పించి అనుమతి ఇప్పించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ కు బట్టీల యజమానులు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఉచితంగా యాష్ అందిస్తున్న ఎన్టీపీసీ యాజమాన్యానికి, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సిద్దయ్య, కొండయ్య, లక్ష్మ న్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## నగునూరు జెడ్‌పిహెచ్ఎస్ తనిఖీ



ప్రజాపక్షం/కొత్తపల్లిః కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధిస్తున్న బోధన పద్ధతులను టివిస్ఏటి ద్వారా పదవ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రదర్శింపబడుతున్న పాఠ్యాంశాలను విద్యార్థులతో కలిసి చూశారు. అనంతరం జన్యు సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విటమిన్ గార్డెన్ పరిశీలించి అందులో పెంచుతున్న మొక్కలలో గణిత ప్రక్రియలకు సంబంధించిన ఆకృతులను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చామన్‌పల్లి పాఠశాల సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న జన్యు కార్యక్రమాలను పరిశీలించి సూచనలు చేశారు. జిల్లా సైన్స్ అధికారి, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు తిరుపతి, సైన్స్ ఉపాధ్యాయులు మదన్, శంకరయ్య తదితరులున్నారు.

## సమస్యలపై పోరాడేది నాన్ గెజిటెడ్ ఉద్యోగ సంఘం

### ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : 80 సంవత్సరాల ఘన చరిత్ర గలిగిన సంఘం టిఎన్జీఓల సంఘం అని, ఉద్యోగాల సమస్యలపై పోరాడి సాధించే సంఘం టిఎన్జీఓల సంఘమని టి ఎన్జీవోల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ శనివారం రోజున పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదే తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి అనుముల రేవంత్‌రెడ్డిని కలిసి ప్రస్తుత ఉద్యోగుల ప్రధాన సమస్యలయిన పెండింగ్ డీఏ లు, పెండింగ్ లో ఉన్న పీ ఆర్ సీ, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల గురించి జరిగిన చర్చ అనంతరం ముఖ్యమంత్రి వచ్చే ఆర్థిక సంవత్సరంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించినట్టు తెలియజేశారు. అంతే కాకుండా వచ్చే ఏప్రిల్ లేదా మే మాసంలో రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రత్యేక అతిథిగా ఎల్ బి స్టేడియంలో భారీ సమావేశం నిర్వహించేటట్టు ప్రణాళికలు చేస్తున్నామన్నారు.ప్రభుత్వఉద్యోగులు ప్రభుత్వంలో భాగంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ అమలుకు కృషి చేస్తామని తెలియజేశారు. తదనంతరం పెద్దపల్లి జిల్లా నాన్ గెజిటెడ్ సంఘఅధ్యక్షులు,పెద్దపల్లి జిల్లా ఉద్యోగ సంఘాల జే ఏ సీ చైర్మన్ శ్రీ బొంకూరి శంకర్ ప్రధాన కార్యదర్శి శ్రీ పిస్క సత్యనారాయణ కలిసి మారం జగదీశ్వర్ ను తలపాగా, శాలువా, గజ మాలతో లతో సత్కరించారు.పెద్దపల్లి జిల్లా నాన్ గెజిటెడ్ సంఘ అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర నాన్ గెజిటెడ్ సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ పెద్దపల్లి జిల్లాకు రావడం సంతోషంగా ఉందని ఉద్యోగస్తులందరిలో స్ఫూర్తి నింపుతుందని, జగదీశన్న అధ్యక్షతన సంఘం బలోపేతం అవుతు ఉద్యోగ సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నాయని, అన్ని విషయాల్లో సంఘంతోనే ఉంటామని పెద్దపల్లి జిల్లా ఉద్యోగుల పక్షాన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాగి శ్రీనివాస్, ఎక్సైజ్ సంఘ అధ్యక్షులు రాజన్న, పెద్దపల్లి జిల్లా మహిళా ఉద్యోగ సంఘ అధ్యక్షులు అనిత, నాన్ గెజిటెడ్ సంఘ ట్రెజరర్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కొమురయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేందర్ రెడ్డి,అర్బన్ సెక్రటరీ ప్రవీణ్, సందీప్‌రావు, మధు పాల్గొన్నారు.

## సాల్వేజింగ్ పనులపై చర్చ



ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కొప్పుల వెంకటేశ్వర్లు శనివారం అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు. నూతనంగా డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి మొదటి సారిగా జి.యం. కార్యాలయానికి విచ్చేసిన వారిని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావును ఇతర అధికారులు సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులతో అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ సంబంధించిన సాల్వేజింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు.ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఎస్వోటుజియం బండి సత్యనారాయణ, పర్సనల్ విభాగాధిపతిబి.సుదర్శనం,అధికారులు రాజేంద్ర కుమార్, టి.రఘురాం, పి.డి.సుధాకర్, షబిరుద్దీన్,రాజేశం, మతీన్ హుస్సేన్ పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ పక్షాన పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వూట్కూరి నరేందర్ రెడ్డిని గెలిపించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి కోరారు.శ నివారం జగిత్యాల పట్టణంతో పాటు పెగడపల్లి మండలం బతికేపల్లిలో శోభారాణి ప్రచారం నిర్వహించారు.పట్టభద్రులను కలిసి నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని కాంగ్రెస్ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడారు.ఉపాధి అవకాశాల కోసం పోరాడే నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు మానపురి మహేష్,సిరిపురం మహేందర్,పెండెం మహేందర్, అనుమల్ల చంద్రం,ఆడెపు రాజేష్, కొప్పు తిరుపతి యూత్ కాంగ్రెస్ జగిత్యాల పట్టణ అధ్యక్షులు తాటిపర్తి పరీక్షిత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్ ఎన్నం కిషన్ రెడ్డి,నాయకులు, పట్టభద్రులు సత్యనారాయణ, గంగయ్య, రాజేందర్ రెడ్డి,ఎన్నం మధుకర్ రెడ్డి,లక్ష్మ ణ్ ఉన్నారు.

## నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు



ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డిని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మె ల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బుగ్గారం మండల కేంద్రంలో పట్టభద్రులు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా లక్ష్మ ణ్ కుమార్ పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో బుగ్గారం మండలానికి చెందిన ఎమ్మార్వో,ఎంపిడిఓ కార్యాలయాలను మండల కేంద్రంలో కాకుండా బయట నిర్మాణం చేయడానికి ప్రయత్నించారని,కానీ మా ప్రభుత్వం వచ్చాక కార్యాలయాలను మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టామన్నారు.వూట్కూరి నరేందర్‌రెడ్డి సిరియల్ నెంబరు 2 పైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు వేముల సుభాష్, దినేష్, సిగిరి అంజిత్, బత్తుల తిరుపతి, జంగా శ్రీనివాస్, సంతోష్ రావు, అక్బర్ షరీఫ్,దేశవేణి శంకర్, రహమాత్ ఖాన్‌ఉన్నారు.

## రంజాన్ మాసం ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి: రంజాన్ మాసం ప్రారంభం నుండి ముగిసేవరకు అవాం చనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తెలిపారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోజిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మసీద్ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్‌పనులుచేయాలనిసూచి ంచారు. ఆర్డీవోలు సదానందం,చంద్రకళ,ఏసిపిలు, మధు, పురుషోత్తం,సతీస్,డిపివో దేవకి దేవి,డిఎంహెచ్‌వో పల్వాన్ కుమార్ పాల్గొన్నారు.

# గంజాయి తరలింపు.. నిందితుడు పట్టివేత



ప్రజాపక్షం/రామగుండం : హైదరాబాద్ శామీర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి వైజాగ్ నుంచి రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా సమాచారం మేరకు రామగుండం రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు శనివారం సాయంత్రం పట్టుకున్నారు. స్థానికంగా గంజాయిని విక్రయించేందుకు వస్తున్నాడనే సమాచారం మేరకు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆదేశాలతో రామగుండం ఎస్.ఐ. సంధ్యారాణి తన సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా గంజాయిని పట్టుకున్నారు. అనుమానస్పదంగా ఓ వ్యక్తి తన వద్ద ఉన్న బ్యాగులతో వేగంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. బ్యాగుల్లో 15.904 కిలోల గంజాయి లభించగా వీటి విలువ రూ.7,95,200 ఉంటుందని ఎస్.ఐ. సంధ్యారాణి తెలిపారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తి శామీర్‌పేట మండలం అతిరాజ్‌పల్లి గ్రామానికి చెందిన తీగుళ్ల రామకృష్ణ అని అతడు ఏ.పి. ఎక్స్‌ప్రెస్ రైలులో తన వద్ద ఉన్న రెండు లగేజీ బ్యాగుల్లో గంజాయిని తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రామకృష్ణపై కే సు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. రైలులో గంజాయి అక్రమ తరలింపు, విక్రయం విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం సీఐప్రవీణ్‌కుమార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాదారుడిని పట్టుకున్న పోలీసు సిబ్బంది సంపత్, నరేష్, బానయ్యలను రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్, ఏసీపీ ఎం. రమేష్, సీఐ ప్రవీణ్‌కుమార్‌లు అభినందించినట్లు ఎస్.ఐ. సంధ్యారాణి తెలిపారు.

## సమస్యల పరిష్కారంలో విఫలం




ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్(అఖిల భారత విద్యార్థి సమాఖ్య) రాజన్న సిరిసిల్ల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సుభాష్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్ ఎనిమిదివేల కోట్ల రూపాయలు ఫీజులు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్పోరేట్ కళాశాలలకు ప్రభుత్వ కొమ్ముకాస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పెండాల ఆదిత్య, మల్యాల శ్రీజ, పెంట భరత్, సహాయ కార్యదర్శులు పుట్టి సాత్విక్, దొంతి అరుణ్, ఈశ్వర్, నిశాంత్, యశ్వంత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

